# మున్సిపల్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలి

- ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి
- ఎన్నికల కమిషనర్, సిఎస్ వీసీ పాల్గొన్న మహబూబ్‌నగర్ కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు



విసిలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 27 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించినట్లే మున్సిపల్ ఎన్నికలను కూడా విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డి.జి.పి. శివధర్ రెడ్డి, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదునుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలతో పోలిస్తే మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య కొంచెం తక్కువగా ఉన్నప్పటికీ ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటర్లకు ఎన్నికలపై అవగాహన ఎక్కువగా ఉంటుంది కాబట్టి తప్పిదాలు చోటు చేసుకోకుండా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా ఆయా జిల్లాల ఎన్నికల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎస్పీ బి.జానకి తో కలిసి విసిలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి విసి అనంతరం జిల్లా ఎన్నికలనోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లతో ఏర్పాట్లు పై సూచించారు. జిల్లాలోని మహబూబ్‌నగర్ కార్పొరేషన్, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీల్లో నామినేషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ ఫారంలు సిద్ధంగా ఉంచాలని అన్నారుఎన్నికల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లు, రిసెప్షన్ సెంటర్‌లు, స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాల్ అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలు, రూట్‌లు క్షేత్ర స్థాయిలో సందర్శించి ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే బసులు పార్కింగ్ ఏర్పాట్లు, కౌంటింగ్ కు పార్కింగ్ ఏర్పాట్లు చూసుకోవాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల పరంగా పోటీ చేసే అభ్యర్థులకు ఆయా పార్టీలగుర్తులు కేటాయించడం జరుగుతుందని, మిగతా ప్రక్రియ మొత్తం గ్రామపంచాయతీ ఎన్నికల మాదిరే ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికీ మాస్టర్ శిక్షకులు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఎస్పీడి.జానకి మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేసేందుకు అవసరమైన పోలీస్‌బందోబస్తు నియమించనున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పి సీఈవో వెంకటరెడ్డి, మహబూబ్ నగర్ కార్పొరేషన్ కమిషనర్ రామానుజ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని




వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్లు , అధికారులు

**వనపర్తి, జనవరి 27 ప్రభాతవార్త:** మున్సిపల్ సాధారణ ఎన్నికలు పకడ్బందీగా, పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించే విధంగా కృషి చేయాలని రాష్ట్ర ఎనికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. మంగళవారం ఎన్నికల నోటిఫికేషన్ జారి చేసే ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డిజిపి బి. శివధర్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. జనవరి, 28 నుండి 30వ తేదీ వరకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకునామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 31న స్క్రూటినీ, వ్యాలిడిటీ ఉన్న నామినేషన్ల విడుదల, ఫిబ్రవరి, 1న ఆర్డీఓకు అప్పీల్ చేసుకునే అవకాశం, ఫిబ్రవరి 2న అప్పీల్ పరిష్కారం, ఫిబ్రవరి3న మధ్యాహ్నం3.00 గంటలవరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు సాయంత్రా నికి నామినేషన్ల తుది జాబితా విడుదల, ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఎన్నిక నిర్వహణ, ఫిబ్రవరి 13వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ట్లు తెలిపారు. 80 వార్డులకు గాను 6 ఎస్ఎస్‌టి., ఎఫ్ఎస్‌టి బృందాలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలీస్ శాఖ సహకారంతో అత్యంత పకడ్బందీగా ఎన్నికల నియమ నిబంధన మేరకు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో చేపట్టిన కట్టుదిట్టమైన భద్రతనే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సారి పార్టీల గుర్తుపై ఎన్నికలు ఉంటాయి కాబట్టి మరింత పకడ్బందీగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేవిధంగా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమావేశం ఎన్నికల ప్రవర్తన నియమావళిపై దిశా నిర్దేశం, జనవరి, 27న ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో వచ్చిందని తెలిపారు. 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, క్యాలండర్‌లు, గోడ పైన రాతలు తొలగించాలని, విగ్రహాలకు తొడుగులు వేయాలని, 48 గంటల్లో పబ్లిక్ స్థలాల్లో, 72 గంటల్లో ప్రైవేట్ స్థలాల్లో ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించారు. జనవరి, 28 న ఉదయం 10 గంటలకు అన్ని రిటర్నింగ్ కార్యాలయాల్లో ఎన్నికల నోటిఫికేషన్ ఫారం 1 విడుదల –మిగతా4లో..

## విజ్ఞానం కోసమే ప్రకృతి వైజ్ఞానిక యాత్ర

- రాజ్యాంగ రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి
- ఎక్సైజ్,టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


విజ్ఞాన యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

**కొల్లాపూర్, జనవరి 27 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలలో కృష్ణానది తీరాన విజ్ఞాన దర్శిని యాత్ర పేరుతో నెహ్రూ సెంటర్, నేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రకృతి వైజ్ఞానిక యాత్ర కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సాధారణంగా ప్రభుత్వాలు చేయాల్సిన సామాజిక బాధ్యతాయుతమైన పనిని, స్వచ్ఛందంగా తమ భుజాలపై వేసుకుని ప్రజలను చైతన్యం చేస్తున్న జన విజ్ఞాన వేదిక నిర్వాహకులకు మంత్రి ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఒడిదొడుకులు ఎదురైనప్పటికీ వెనకడుగు వేయకుండా సమాజ శ్రేయస్సు కోసం, ప్రకృతిని కాపాడుకోవడం కోసం, ప్రజల్లో విజ్ఞాన, వైజ్ఞానిక దృక్పథం పెంపొందించడం కోసం పట్టుదలతో పనిచేస్తున్న తీరు అద్భుతమని కొనియాడారు. శాస్త్రీయ ఆలోచనా విధానంతో పాటు, దేశ ప్రజలందరికీ రక్షణ కవచమైన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి గుర్తు చేశారు. సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలు, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కూడా యువత, మేధావులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అయ్యే వ్యయం కోసం రాష్ట్ర సాంస్కృతిక శాఖ నుండి నిధులు మంజూరు చేస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మరిన్ని వైజ్ఞానిక యాత్రలను ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ వెన్నెల గద్దర్, కవి జయరాజ్, విజ్ఞాన దర్శిని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్, జన విజ్ఞాన వేదిక, విజ్ఞాన దర్శిని సభ్యులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధిలో గద్వాల మున్సిపాలిటీ అస్తవ్యస్తం

- ఎమ్మెల్యే ఏ పార్టీల ఉన్నాడో ప్రజలకు తెలపాలి
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే ఐతే పార్టీ కండువాతో ప్రచారంలో తిరగాలి
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

**గద్వాల జనవరి 27, ప్రభాతవార్త:** పదేళ్లుగా పాలకులు పట్టించుకోక పోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా గద్వాల మున్సిపాలిటీ పట్టణాభివృద్ధి అస్తవ్యస్తంగా తయారైందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం పట్టణంలోని డీకే బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ, పట్టణ పాలకుల స్వార్థ రాజకీయాల నిర్లక్ష్యం వల్లే అభివృద్ధిలో గద్వాల పట్టణం పాడైందనీ అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే బిఆర్ యస్ పార్టీలో ఉన్నారా లేక, కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా అని ప్రశ్నించారు. ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు స్పష్టంగా చెప్పుకోలేని దుస్థితిలో పాలన కొనసాగుతుందని ఆమె విమర్శించారు. ఎమ్మెల్యే బిఆర్ యస్ పార్టీ లోనే ఉన్నట్లూ చెప్పుకుంటున్నారని, అదే నిజమైతే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌యస్ పార్టీ కండువా వేసుకుని ఓట్లు అడగాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపుకోసం ప్రజలను మోసం చేస్తూ స్వార్థ రాజకీయాలు చేస్తున్నారనీ, పార్టీ పిరాయింపుల స్వార్థ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ఆమె అన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ లలో పోటీ చేసేందుకు బీజేపీ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని, ఈ ఎన్నికల్లో గద్వాల మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థులను పెద్ద ఎత్తున గెలిపించాలని పట్టణ ప్రజలను కోరారు. పిల్లిగుండ్లలో నాడు మంత్రి హోదాలో 3 వేల మందికి పట్టాల పంపిణీ చేశామని, ప్రైవేటు భూములు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసి మార్కెట్ రేటు ప్రకారం ఇవ్వాలని భావించి సొంత నిధులు అదనంగా ఖర్చు చేసి 78ఎకరాల భూమి కొనుగోలు చేసి పేదలకు పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అభివృద్ధికోసం అధికార పార్టీ దగ్గరకు వెళ్లనని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. పట్టణప్రాంత ప్రజలను పదేపదే మోసం చేస్తున్నారని, ఈ ఎన్నికల్లో ఓటర్లు స్వార్థ రాజకీయా నాయకుల చేతిలో మోస పోకుండా పట్టణ అభివృద్ధికి పాటుబడే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అభివృద్ధి ఎవరు చేశారో గద్వాల ప్రజలకు తెలుసునని, కుల మత బేధం లేకుండా బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసంలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి

- విద్యుత్, పారిశుద్ధం, నీటి కొరత లేకుండా చూడాలి
- ట్రాఫిక్ ఇతర సమస్యలు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్


ముస్లిం కమిటీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయంలతో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో రంజాన్ మాసం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో, ముస్లిం సంఘాలు, మస్జిద్ కమిటీల ప్రతినిధులతో సమీక్షించారు. ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ప్రశాంతంగా జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల ప్రాంతాలు, మున్సిపాలిటీలలో సైతం అవసరమైన ఏర్పాట్ల కోసం అధికారులకు సూచనలు జారీ చేశామన్నారు. రంజాన్ మాసంలో మసీదుల వద్దహైమాస్ట్ లైట్, వీధిదీపాలపని తీరు పర్యవేక్షించాలని, మసీదుల వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. మసీదుల వద్ద వీధి కుక్కల బెడద ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి మసీదు వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. మస్జిద్‌ల వద్ద ఎక్కడైన డ్రైయినేజి, అప్రోచ్ రోడ్డు గుంతల మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలన్నారు. షాపులు 24 గంటలు నడిపేందుకు గల అవకాశాలను పరిశీలించి పోలీసు శాఖ సూచనలు అందిస్తుందని అన్నారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని, మసీదులకు అవసరమైన మేర త్రాగునీటి సరఫరాను అందిస్తామని అన్నారు. ప్రతి మసీదు దగ్గర పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, ఏదైనా మస్జిద్ దగ్గర త్రాగు నీటి సరఫరా, విద్యుత్ సరఫరా సంబంధించి ఏదైనా పనులు ఉంటే వెంటనే తెలియజేయాలని ముఖ్యంగా ఈద్గాలు, కబ్రస్తాన్ లలో పిచ్చి మొక్కలు తొలగించాలని పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీలలో ఉన్న మస్జిద్ జాబితా తయారు చేసి రెగ్యులర్‌గా అక్కడ పారిశుద్ధ్య పనులు జరిగేలా పంచాయతీ అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మస్జిద్ వద్ద నిరంతరం విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పండగ సందర్భంగా షాపింగ్ కోసం మార్కెట్ వద్ద పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, ప్రతి మసీదు వద్ద పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతి మసీదు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ముస్లిం ప్రతినిధులతో కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ శాఖ ఇన్చార్జి అధికారి రాజేశ్వరి, జిల్లా వక్ఫ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ సిరాజ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబీబ్ ఉర్ రెహమాన్, వక్ఫ్ కాంప్లెక్స్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షేఖ్ ఫరీద్ అహ్మద్, ముస్లిం అడ్వైజరీ కమిటీ అధ్యక్షులు షేఖ్ మసూద్, ఉపాధ్యక్షులు షేక్ యాకూబ్ బావజీర్, ముస్లిం అడ్వైజరీ కమిటీ మాజీ అధ్యక్షుడు హబీబ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

## ఆంధ్ర పాలకుల తొత్తు రేవంత్‌రెడ్డి

- తెలంగాణ ప్రయోజనాలకు తూట్లు పొడుస్తున్న రేవంత్‌రెడ్డి
- సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధించాలి
- టికెట్ రాని నాయకులు నిరాశ పడొద్దు పార్టీ గుర్తిస్తుంది
- మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, జనవరి27 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్ అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశములో మున్సిపల్‌ఎన్నికల ఇంచార్జ్ స్వామిగౌడ్ మాజీ శాసన మండలి చైర్మన్ హాజరై మాట్లాడారు. ఆంధ్ర పాలకుల బానిస పాలనకు చరమగీతంపాడి తెలంగాణకు కెసిఆర్ విముక్తి కలిగించారని కానీ నేడు రేవంత్‌రెడ్డి మళ్ళీ ఆంధ్ర పాలకుల తొత్తుగా మారి తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారు అని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో కెసిఆర్ సంక్షేమ పథకాలు, మనం చేసిన అభివృద్ధి వివరించి ఓట్లు అభ్యర్థించాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి ఐకమత్యంగా పనిచేసి గెలిపించుకోవాలని టికెట్ రాని వారు నిరాశ చెందవద్దని పార్టీ భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. 420 హామీలు, 6 గ్యారంటీలు అమలు చేయకపోవడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మహిళలకు రూ.2500, ఆసరా పింఛన్లు రూ4000, కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు విద్యార్థులకు విద్యా బరోసా విద్యార్థినులకు స్కూటీలు ధాన్యానికి బోనస్ గ్యాస్ సబ్సిడీ రైతులకు రైతు భరోసా రైతు రుణ మాఫీ రైతు బీమా వంటి పథకాలు ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్ రెడ్డి

**సమర్థత, సర్వేలతో అభ్యర్థుల నిర్ణయం :** పార్టీ పట్ల విశ్వాసం, విధేయత, కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే అభ్యర్థుల ఎంపిక మున్సిపల్ ఎన్నికల విజయం కెసిఆర్‌కు కానుక కావాలి, బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన బైక్ ర్యాలీకి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించిందని ప్రజలు మళ్ళీ సిఎం కావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పట్టణములో అభ్యర్థుల గురించి పార్టీ అంతర్గత సర్వేలు నిర్వహిస్తుందని పార్టీ పట్ల విశ్వాసం విధేయత కార్యకర్తల ఏకాభిప్రాయం కలిగిన వాళ్లను అభ్యర్థులుగా నిలబెడతామని అందరం సమిష్టిగా పనిచేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టిక్కెట్లు రాని వాళ్ళు సమర్థులు కారని పార్టీ అభిప్రాయం కాదని వారికి కూడా పార్టీ తగిన రీతిలో గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి కెసిఆర్‌కు మన తరఫున బహుమతి ఇద్దామని ప్రతిజ్ఞ చేశారు. నాకోసం మీరు కష్టపడ్డారు అని మీ కోసం నేను కష్టపడి మిమ్మల్ని ఉన్నత స్థాయిలో నిలుపుతానని అన్నారు. పెద్ద సంఖ్యలో ర్యాలీ, సమావేశములో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులుగట్టుయాదవ్ అధికారప్రతినిధి వాకిటిశ్రీధర్, కె.మాణిక్యం, మాజీ కౌన్సిలర్స్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టణంలోని పురవీధుల్లో భారీ ర్యాలీగా బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులు


నామినేషన్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

## ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్
- మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ నామినేషన్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

**మహబూబ్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త:** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ జానకి ధరావత్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా ఎస్పీ డి.జానకి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్పొరేషన్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియను శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సజావుగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై జిల్లా ఎస్పీ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా నామినేషన్ కేంద్రం మరియు పరిసర ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. నామినేషన్ కేంద్రానికి వచ్చే అభ్యర్థులు, ప్రతిపాదకులు, మద్దతుదారులు వేర్వేరు మార్గాల ద్వారా రాకపోకలు సాగించేలా ప్రణాళిక రూపొందించాలని, అనధికార గుంపులు చేరకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగిన పోలీస్ సిబ్బందిని నియమించాలని తెలిపారు. అలాగే సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియ నిబంధనల ప్రకారం జరగాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అధికారులకు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామాంజుల రెడ్డి, ఎలక్షన్ సెల్ డీఎస్పీ గిరిబాబు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్యతో పాటు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో మున్సిపల్ నామినేషన్‌ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు.

## రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ


ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు వ్యవసాయ యాంత్రికరణలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, జనవరి 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వలక్ష్యమని తమిళనాడు ఏఐసిసి పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం అచ్చంపేట వ్యవసాయ సంచాలకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ యాంత్రికరణ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. –మిగతా4లో..

# మున్సిపల్ నోటిఫికేషన్ నేడు

- ఫిబ్రవరి 11న ఎన్నికలు ..13న ఫలితాలు
- ఫిబ్రవరి 16న మేయర్, డిప్యూటీ మేయర్లు, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక

**భూత్పూర్,జనవరి 27, ప్రభాతవార్త:** ఎట్టకేలకు మున్సిపాలిటీలు,కార్పొరేషన్ల ఎన్నికలకు నేడు (బుధవారం)నోటిఫికేషన్ వెలువడనుంది.రాష్ట్రంలోని ఏడునగర కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.ఈ నెల 28న ఎన్నికల నోటిఫికేషన్,30వరకు నామినేషన్ల స్వీకరణ,31న నామినేషన్ల పరిశీలన,నామినేషన్లపై అభ్యంతరాలు తెల్పుటకు ఫిబ్రవరి ఒకటి,ఫిబ్రవరి రెండున అభ్యంతరాలపై పరిష్కారం,నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఫిబ్రవరి 3.ఫిబ్రవరి అభ్యర్థులఫైనల్ లిస్ట్(తుది జాబితా),ఫిబ్రవరి11న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్,12న రీపోలింగ్(అనివార్యమైతే),ఫిబ్రవరి 13న ఉదయం 8గంటల నుంచి కౌంటింగ్,సాయంత్రానికల్లా ఫలితాల వెల్లడి.ఫిబ్రవరి 16న కార్పొరేషన్ల మేయర్,డిప్యూటీ మేయర్,మున్సిపాలిటీల చైర్మన్,వైస్ చైర్మన్ల ఎన్నిక ఉంటుందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిణి రాణి కుముదిని మంగళవారం సాయంత్రం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు.
మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీల(భూత్పూర్-10,కొత్తకోట-15,దేవరకద్ర-12)లో మొత్తం 37వార్డు కౌన్సిలర్ల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ పదవిని ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఈ పదవికి మాజీ కౌన్సిలర్ ఎం బాలకోటి పోటీ పడుతుండగా,అధికార పార్టీ ఎమ్మెల్యే జీఎంఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.దీంతో బాలకోటి విజయం నల్లేరు మీద నడకేనని చెబుతున్నారు.

# నడిగడ్డ ఇలవేల్పు శ్రీజమ్ములమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**గద్వాల జనవరి 27, ప్రభాతవార్త:** నడిగడ్డ ఇలవేల్పు అయిన శ్రీ జమ్ములమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుండి ప్రారంభమైనట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి ఆర్.పురేందర్‌కుమార్ తెలిపారు. అమ్మవారి పుట్టినిల్లు అయిన గుర్రంగడ్డ గ్రామంలో అమ్మవారి ఆలయాన్ని పూల తోరణాలతో, దీపాలంకరణతో సుందరంగా అలంకరించి జాతర ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని తెలిపారు.శ్రీజమ్ములమ్మ అమ్మవారి జాతరలో భాగంగా మంగళవారం అమ్మవారి బండి కార్యక్రమం సందర్భంగా అమ్మవారినీ పుట్టినిల్లు అయిన గుర్రంగడ్డ గ్రామంకు జమ్మిచేడు గ్రామ ప్రజలు, భక్తులు శ్రీ జమ్ములమ్మ అమ్మవారిని దేవస్థానము నుండి ఎద్దుల బండిపై ఊరేగింపుగా తీసుకుని వెళ్ళుతారని తెలిపారు. గుర్రంగడ్డ గ్రామములో గల శ్రీజమ్ములమ్మ అమ్మవారి ఆలయములో అమ్మవారికి అభిషేక, అలంకార కార్యక్రమంలు అత్యంత వైభవంగా నిర్వహించిన అనంతరం, తిరిగి అమ్మవారు మరుసటి రోజు బుధవారం ఉదయం 8.00 గంటలకు పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, బైనోళ్ల డప్పుల చప్పుళ్ళు,బాజా భజంత్రీలతో,భక్తుల కోలాహలముల మధ్యన జమ్మిచేడు దేవస్థానంకు అమ్మవారు చేరుతారని తెలిపారు.

# గ్రామ సమస్యలు తెలుసుకున్న సర్పంచ్



గ్రామంలో పర్యటిస్తూన సమస్యలు తెలుసుకుంటున్న సర్పంచ్ విజయ్‌కుమార్‌రెడ్డి

**శ్రీరంగాపూర్, జనవరి 27 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలంలోని కంబాలపురం గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ విజయకుమార్‌రెడ్డి వార్డు మెంబర్లు కరెంటు డిపార్టుమెంట్ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శి తో కలిసి గ్రామంలో తిరిగి డ్రైనేజీ సమస్యలు నీటి సమస్యను, రోడ్లపై కంపచెట్లను రోడ్లపై నీటిని వదిలే సమస్యను, ఇంకుడు గుంతలు లేనటువంటి వాటిని గుర్తించడం జరిగింది. గ్రామంలో ఎక్కడైతే కరెంటు స్తంభాలు అవసరమో, గుర్తించడం జరిగింది. త్వరలో గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేసి గ్రామసభలో గుర్తించిన సమస్యలను ఏ విధంగా పరిష్కారం చేయాలో గ్రామ సభలో నిర్ణయించి గ్రామాన్ని అభివృద్ధి దశలో ముందుకు తీసుకువెళ్తానని గ్రామ సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయకుమార్‌తో పాటు కరెంటు లైన్‌మెన్ శ్రీనివాసులు,పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, వాటర్ మాన్ వెంకటయ్య నాయుడు, వార్డు మెంబర్లు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# తహసీల్దార్‌ను సన్మానించిన కాంగ్రెస్ నేతలు

**చిన్నచింతకుంట, జనవరి27 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్‌చే ఉత్తమ తహసిల్దార్ అవార్డును అందుకున్న తహసిల్దారు ఎల్లన్న ను మంగళవారం ఆయన చాంబర్‌లో కాంగ్రెస్ నేతలు లాల్ కోట మోహిన్, మాజీ కోఆప్షన్ జాకీర్, వార్డు సభ్యులు శేఖర్, గౌస్, జిల్లా కారోబార్ సంఘం అధ్యక్షుడు కురుమన్న, సయ్యద్ భాషా, వీరన్నలు శాలువాతో సత్కరించారు.

# మాదిగల ఐక్యవేదిక మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, జనవరి27 ప్రభాతవార్త:** మాదిగల ఐక్యవేదిక మండల కమిటీని నూతనంగా మంగళవారం మాదిగల ఐక్యవేదిక వ్యవస్థాపక కమిటీ పకాడి జయప్రకాశ్, నక్కరకంటి శ్రీనివాసులు, కోయ్యల పుల్లయ్య, తక్కెళ్ళపల్లి శేఖర్, గుద్దటి ప్రభాకర్, తాంద్ర జంగయ్య, దార్ల కుమార్, దుబ్బ నాగేష్, కొమ్ముల పుష్పగిరిరావుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెల్దండ మండల అధ్యక్షులుగా గొల్లోనిపల్లి గ్రామానికి చెందిన దూల సామేల్, ప్రధాన కార్యదర్శిగా ముంగళ్శెట్టి మల్లేష్, ఉపాధ్యక్షులుగా పోలెవెంకటేష్, మంగళగిరి శ్రీను, దుబ్బ రమేష్, కార్యదర్శులుగా మీసాల రాజు, కలకొండ మోగులయ్య, గడుసు శివ, దాసరి శివప్రసాద్, కోశాధికారిగా పకాడి శశి కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ముడి లక్ష్మణ్, పోలె వెంకటయ్య, కొమ్ము నాగయ్య, కొమ్ము జలేందర్, పకాడి రామాంజనేయులు, ప్రచార కార్యదర్శులుగా కొమ్ము రాములు, కట్ట సైదులు, తాంద్ర శ్రీను, ఈదులపల్లి శ్రీను, జోగు సైదులు, మీడియా కన్వీనర్ గా దండు జగన్, సాంస్కృతిక కార్యదర్శిగా నల్ల జంగయ్యలతో పాటు మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా నూతనంగా ఎన్నికైన మండల కమిటీకి నాయకులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పోలే అశోక్, చిన్న అంజయ్య, తలారి జంగయ్య,డీలర్ వెంకటయ్య, మల్లెపాకుల శేఖర్ ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి నెట్‌బాల్‌కు కొండాపూర్ గురుకుల క్రీడాకారుల ఎంపిక



నెట్‌బాల్‌కు ఎంపికైన గురుకులం క్రీడాకారులు

**ధన్వాడ,జనవరి 27 ప్రభాతవార్త:** ధన్వాడలోని కొండాపూర్ పీఎం శ్రీ గిరిజన గురుకులానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయిలో తమ ప్రతిభను చాటేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 28 నుంచి 31 వరకు మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్‌లో జరిగే 69వ జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ 17 సంవత్సరాల లోపు బాలుర నెట్‌బాల్ పోటీలకు, గురుకులంలో 9వ తరగతి చదువుతున్న కే.శివ, కే.అరుణ్‌లు తెలంగాణ రాష్ట్రఅండర్17 నెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. గత ఈ నెల 16 నుంచి 18 వరకు ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు అద్భుత ప్రతిభ కనబరిచి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ఫస్ట్ రన్నరప్ (సిల్వర్ మెడల్) సాధించడంలో కీలక పాత్ర పోషించారు.ఈ ప్రతిభతోనే జాతీయస్థాయి పోటీలకుచోటు దక్కిందనిప్రిన్సిపాల్ రాజారాం తెలి పారు. విద్యార్థుల ఎంపికపట్ల కోచ్ డా.రామ్మోహన్ గౌడ్, పీఈటీ ఆంజనేయులు, హౌస్ అనిల్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు,విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కొండాపూర్ గురుకులం నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులు ఎంపిక కావడం సంస్థకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకం

- వనపర్తి జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి
- అలైవ్-అరైవ్ కార్యక్రమంలో భాగంగా 10వ రోజు అవగాహన కార్యక్రమం
- 65 హెల్మెట్లు పంపిణీ చేసిన అయ్యప్పరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్
- పాత్రికేయులు, పోలీసులకు, మహిళలకు హెల్మెట్ల పంపిణీ



అలైవ్ - అరైవ్" కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ, హాజరైన మహిళలు

**వనపర్తి, జనవరి27 ప్రభాతవార్త:** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అలైవ్ - అరైవ్" కార్యక్రమంలో భాగంగా 10వ రోజు మంగళవారం ఉదయం పెద్దమందడి మండల కేంద్రంలోని రైతువేదికలో, అయ్యప్ప రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలు, పాత్రికేయులు, పోలీసులకు హెల్మెట్ ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.అనంతరం అయ్యప్ప రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ వారి సహకారంతో 65 హెల్మెట్లను పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది, మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబంలో పిల్లలు, భర్తలు, అన్నదమ్ములు సురక్షితంగా ఇంటికి చేరాలంటే మహిళలు వారికి హెల్మెట్ వినియోగంపై నిరంతరం గుర్తు చేయాలన్నారు. హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన నిబంధన మాత్రమే కాకుండా, కుటుంబ ఆనందాన్ని కాపాడే భద్రతా కవచమని మహిళలు స్వయం సహాయక సంఘాలద్వారా గ్రామస్థాయిలో రోడ్డుభద్రత సందేశాన్ని విస్తరించాలని,తమ కుటుంబాలతో పాటు సమాజాన్ని కూడా ప్రమాదాల నుంచి రక్షించాలన్నారు.అమ్మమాటలోనే భద్రత ఉంది భార్య సూచనలోనే భర్త జీవితం ఉంది పిల్లల చిరునవ్వుల కోసం హెల్మెట్ తప్పనిసరని హెల్మెట్‌ధరించమని అడగడం హెల్మెంట్ ధరించకుండా వెళ్లనివ్వడం ప్రమాదమని రెండుచక్రాలవాహనాలు నడిపేప్రతి ఒక్కరూ హెల్మెట్‌తప్పనిసరిగా ధరించాలని,అదిచట్ట పరమైన నిబంధన మాత్రమే కాకుండాకుటుంబ ప్రాణాలనుకాపాడే భద్రతా కవచమని అన్నారు.మహిళలుతమభర్తలు,పిల్లలుహెల్మెట్ ధరించ కుండా వాహనాలు నడపకుండాఖచ్చితంగా గుర్తు చేయాలని, అదే నిజమైన కుటుంబ బాధ్యతని భర్త బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ఉందాఅని అడగడంభార్యప్రేమ..పిల్లల భవిష్యత్తు గురించి ఆలో చించడం తల్లి బాధ్యతని హెల్మెట్ ధరించమని చెప్పడం ఒక మాటకాదు కుటుంబాన్ని ప్రమాదాల నుంచి కాపాడే భద్రతని ఎస్పీ అన్నారు.

# పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ప్రొసిడింగ్స్ అందజేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర,జనవరి 27 ప్రభాతవార్త:** గత ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు అన్యాయం జరిగితే, ప్రజా ప్రభుత్వంలో నిరుపేద ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలిచారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర మండలం గురకొండ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్‌ను ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గతప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక పార్టీలకతీతంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ సకాలంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తుందన్నారు. పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులుఅంజిల్‌రెడ్డి,గురకొండ సర్పంచ్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఉషనప్ప,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 6 గ్యారెంటీల పేరుతో మోసం

- బిఆర్ఎస్ కేంద్రంలో లేదు, రాష్ట్రంలో లేదు
- అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం : బీజేపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బొక్క బాల్‌రెడ్డి

**వనపర్తి రూరల్, జనవరి27 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో వనపర్తి మున్సిపాలిటీ ఇంఛార్జిగా ముఖ్య అతిథిగా బొక్క బాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని, బిఆర్ఎస్ పాలనలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అభివృద్ధి శూన్యమని తీవ్రంగా విమర్శించారు. బీజేపీ పాలనలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వనపర్తి మున్సిపాలిటీని బీజేపీ కైవసం దిశగా తీసుకెళ్లేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి, వెంకటర్‌రెడ్డి, మాజీజడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్‌గౌడ్,కల్పన,సంస్థాగత కార్యదర్శి కేతూరి బుద్ధన్న, బిజెపి కార్యదర్శి సరోజ,కవిత, బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్,బిజెపి పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్,33వార్డుల అభ్యర్థులు నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# మద్యం విక్రయ కేంద్రాలుగా రోడ్లపై దాబా హోటళ్లు



దాబాలలో సిటింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం

**నవాబుపేట, జనవరి 27 ప్రభాతవార్త :** రోడ్డుకు ఇరువైపులా వెలిసిన దాబా హోటళ్లు మద్యం విక్రయ కేంద్రాలుగా మారాయి. పర్మిషన్ లేని పర్మిట్ రూములతో రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకున్న దాబా హోటళ్లలో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. మండలంలో ఎటు చూసినా రహదారుల పక్కన అనేక దాబా హోటళ్లు వెలిశాయి. కాకర్లపాడు నుంచి మొదలుకొని కొల్లూరు పరిధి వరకు ఉదయం 11 నుంచి రాత్రి ఒంటిగంట వరకు మందుబాబులకు రోడ్డు పక్కన హోటల్లు దాబాలు అడ్డాగా మారాయి. ఉదయం 11 నుంచి దాబా హోటళ్ల మందుబాబులతో కిటకిటలాడుతున్నాయి. ఇక్కడ వారు తాగితందనాలాడటానికి సిటింగ్ ఏర్పాటు ఉండడంతోమందుబాబులకు అడ్డాగామారాయి. దీంతో తరచుగా మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ యాక్సిడెంట్లు గొడవలు జరుగుతున్నాయని సమీప గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు.దాబా హోటళ్లు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా ఇటు పోలీసు అధికారులు అటు ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లలో మద్యం తాగే ఏర్పాటు చేయడం, అర్ధరాత్రి వరకు హోటళ్లు నిర్వహించడం, మద్యం తాగే వారికి ప్రత్యేక గదులుఏర్పాటు చేయడం, మందుబాబులకు సిట్టింగ్ ఏర్పాటు చేయడం లాంటివి జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని దీనికి తోడు నాయకుల మద్దతు ఉండడంతో దాబా నిర్వాహకులు రెచ్చిపోతున్నారు అని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన దాబా హోటల్లో మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# సంతు సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకులు ఎస్. బిచ్చనాయక్



సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న గిరిజన నాయకులు

**ఉప్పునుంతల, జనవరి 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హామీ మేరకు 125 అడుగుల సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని మద్ది మడుగుపుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేయాలని , యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకులు సభవాట్ బిచ్చ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజన నాయకులు విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సేవ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్. బిచ్చనాయక్, కేతావత్ తులసీ రాంనాయక్,ధర్మనాయక్ ,మంగ్యా నాయక్ ,లచ్చు నాయక్, లోక్యా నాయక్ , మంత్రియా నాయక్ , రాముల నాయక్ , దేశ నాయక్‌లు మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 125 అడుగుల విగ్రహాన్ని మద్దిమడుగు పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తరఫున సహకరిస్తారని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ బహిరంగ సభలో లక్షలాది మంది ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించడంతో యావత్ బంజారా జాగృతి హర్షించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అచ్చంపేట శాసనసభ్యులు డా. చిక్కుడు వంశీకృష్ణ, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, మాజీ శాసనమండలి సభ్యులు రాములు నాయక్, శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్‌ల నాయకత్వంలో రెవెన్యూ శాఖ అధికారుల సహకారంతో మద్దిమడుగు పుణ్యక్షేత్రానికి సమీపంలో 20 ఎకరాల స్థలాన్ని గుర్తించడం జరిగిందని, ప్రకృతి సోయగాలకు నిలయమై శ్రీశైలం, శ్రీ ఉమామహేశ్వరం, మద్దిమడుగు లాంటి పుణ్యక్షేత్రాలతో శోభిల్లుతూ దేవనామ స్మరణారతో తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేలాది తరలి వచ్చే భక్తుల పారవశ్యంతో నల్లమల్ల ప్రాంతం కావడం అదేవిధంగా దక్కన్ పీఠభూమిని తలపించే విధంగా ఎత్తైన ప్రదేశంగా ఉండడం ఈ ప్రాంతం ప్రత్యేకత, కృష్ణానది పరవళ్లతో శోభిల్లుతున్న నల్లమల్ల ప్రాంతం అన్ని విధాలుగా సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు అనుకూలంగా ఉందని, సత్వరమే ముఖ్యమంత్రి హామీ మేరకు విద్యా ప్రాతిపదికన భూమి పూజ చేసి పనులు ప్రారంభించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొంతమంది ఈ ప్రాంతంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ సేవా సంఘం నాయకులు రాజగోపాల్, దశరథ్, శంకర్, నరేందర్, లక్ష్మణ్, గిరిజన సేవా సంఘం అచ్చంపేట నాయకులు దగ్గు, రాంబాబు, రాములు, చందు, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, జనవరి 27 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన పోలె యాదయ్యకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.23 వేల చెక్కును మంగళవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ బాధితుడికి అందజేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెన్నోజు ప్రసాద్ చారి, వార్డు సభ్యులు పల్సం శ్రీధర్ గౌడ్, జక్కుల మల్లేష్ యాదవ్, మాదుగుల నిరంజన్, కాటిక అంజయ్య, తక్కళ్లపల్లి లలిత మల్లయ్య, మమత అనిల్,తిరుపతినాయక్, నెంట శ్రీను, వరికుప్పల ఆంజనేయులు, విజేందర్, వెంకటేష్, శివధనుష్, సుధాకర్, మంగలి తిరుపతియ్య,చాకలి యాదయ్య, వెంకటయ్య,అంజి, తదితరులు ఉన్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్స్‌లను నియమించాలని మంత్రి వినతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్‌లను నియమించాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు నాగర్‌కర్నూలు జిల్లా ట్రాన్స్ జెండర్స్ సొసైటీ సభ్యులు వినతి పత్రం అందించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నియమించే కోఆప్షన్ సభ్యులలో ఒకరిని ట్రాన్స్ జెండర్స్‌లకు అవకాశంకల్పించాలని కోరారు. దీంతోపాటు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు,ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రేషన్ కార్డులు అందించాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ బాధ్యులు శివాని నాయక్, జానకి నాయక్, దీక్షితలు ఉన్నారు.

# ఉత్తమ వైద్యాధికారిగా డా. శ్రావణ్ కుమార్



ఉత్తమ వైద్యాధికారిగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డా. శ్రావణ్‌కుమార్

**నవాబుపేట, జనవరి 27 ప్రభాతవార్త :** ఉత్తమ వైద్యాధికారిగా నవాబుపేట ప్రాథమిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. శ్రావణ్ కుమార్ సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి చేతుల మీదుగాఉత్తమ వైద్యాధికారిగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డా. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజలకు ఆరోగ్య సమస్యలపై సేవలను అందించడం గుర్తించి ప్రశంసా పత్రాన్ని అందుకోవడం గర్వంగా ఉందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.నవాబుపేట మండల ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి గుర్తింపునిచ్చిన పై అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు మరింతగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# పిడిఎస్‌యు రాష్ట్ర కార్యవర్గంలోకి పాతపల్లి అన్నదమ్ములు



అన్నదమ్ములు బి. బాలకృష్ణ, బి.మహేష్

**ధన్వాడ, జనవరి 27 ప్రభాతవార్త :** ఖమ్మం జిల్లా కేంద్రంగా 23, 24, 25 తేదీలలో జరిగిన పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభల్లో నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం పాతపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు బి.బాలకృష్ణ, బి.మహేష్‌లు పిడియస్‌యు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నిక కావడం విశేషంగా నిలిచింది. ప్రస్తుతం బి.బాలకృష్ణ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడిగా, బి.మహేష్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజం లక్ష్యంగా ఉద్యమాలు సాగిస్తూ ఇద్దరూ విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు.గతంలో నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేసిన బి.బాలకృష్ణ మక్తల్, ధన్వాడ ప్రాంతాల్లో విద్యార్థుల సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపారు. చదువు నిమిత్తం వరంగల్ చేరిన తర్వాత కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడిగా కొనసాగుతూ రాష్ట్రస్థాయి నాయకత్వంలోకి ఎదగడం గమనార్హం. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు అన్నదమ్ములు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నిక కావడం పట్ల పాతపల్లి గ్రామ ప్రజలు, పెద్దలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

**అలంపూర్ జనవరి27, ప్రభాతవార్త:** మంగళవారం నాడు జంతు సంరక్షణ చట్టం ఆర్టికల్ 51ఎ (జి) భారత రాజ్యాంగం కల్పించిన చట్టంహక్కులు కార్యాచరణలో బాగంగా జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండల లోని లింగనవాయి గ్రామంలోని స్థానిక హైస్కూల్ 8వ, 9వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు రాధ, క్లాస్ టీచర్లు సహకారంతో పశుసంవర్ధక శాఖా అధికారులు డాక్టర్ శంకరయ్య,విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ,పశువుల సంరక్షణ బాధ్యత,జంతుహింస సంరక్షణ చట్టం ప్రకారం పశువుల అక్రమ రవాణాను అరికట్టుట, జంతువులను హింసించ్చుట, వధశాలలు నిర్వహణ, తదితర వాటికి సంబంధించిన లీగల్ చట్టాల ఉల్లంఘన కింద తీసుకోవాల్సిన ఆవశ్యకత చర్యలు మొదలైన వాటి గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు,పోలీస్‌శాఖ ,రవాణా శాఖ,జంతు ప్రేమికులు, విద్యార్థులు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతైన ఉందని తెలపడమైంది. ఈ కార్యక్రమంలో అలంపూర్ మండల పశువైద్య అధికారి డా కె.శంకరయ్య,పశుసంవర్ధక సిబ్బంది ప్రకాష్,గోపాలమిత్రలు చిన్న స్వాములు పాల్గొన్నారు.



రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు కాలిపోయిన దృశ్యం

# నిరక్ష్యంతో నశిస్తున్న హరిత సంపద

## హరితహార కార్యక్రమ ఉద్దేశం ప్రశ్నార్థకంగా మారుతోంది

**ధన్వాడ, జనవరి 27 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని వివిధ గ్రామాలలో ఎండాకాలం మొదలవుతున్న వేళ గ్రామాల పరిసరాల్లో అగ్ని ప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్ల చుట్టూ గడ్డి, పొదలు అధికంగా పెరిగి ఉండటంతో, పొలాల్లో చెత్తను తగలబెట్టే సమయంలో మంటలు వ్యాపించి చెట్లు కాలిపోతున్న ఘటనలు పెరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్న హరితహారం కార్యక్రమం ఉద్దేశమే ప్రశ్నార్థకంగా మారుతోంది.గ్రామీణ రహదారుల వెంట నాటిన వేలాది మొక్కలు సంరక్షణ లేక ఎండిపోయి, కొన్నిచోట్ల పూర్తిగా కాలిపోయినదృశ్యాలు కనిపిస్తున్నాయి. చెట్ల అడుగున గడ్డి తొలగించకపోవడం, ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయకపోవడం వల్ల చిన్న మంట కూడా పెద్ద ప్రమాదంగా మారుతోంది. ఇది అధికారుల నిరక్ష్యాన్లికి నిదర్శనమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశానికి సంబంధించి ప్రధాన బాధ్యత గ్రామపంచాయతీ, అటవీశాఖ, అలాగే ఆర్‌అండ్‌బీ (రోడ్లు భవనాలు) శాఖ అధికారులపై ఉంది. గ్రామపంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ పర్యవేక్షణలో రోడ్లపక్కన ఉన్న గడ్డిని తొలగించాలి.అటవీ శాఖ అధికారులు నాటిన మొక్కల సంరక్షణ, ఫైర్ లైన్స్ ఏర్పాటు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. అలాగే ఆర్అండ్‌బీ శాఖ రహదారుల వెంట భద్రత చర్యలు తీసుకోవాలి.గ్రామస్తులు కోరేది ఒక్కటే –రోడ్ల పక్కన ఉన్న చెట్ల చుట్టూ వెంటనే శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి, గడ్డిని తొలగించి, మంటలు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని లేదంటే రాబోయే రోజుల్లో మరింత హరిత సంపద నశించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి చర్యలు తీసుకుంటేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ప్రజలు అంటున్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరికి ధన్యవాదాలు తెలుపుతూ విద్యార్థుల ర్యాలీ



**మక్తల్ టౌన్,జనవరి 27 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గ కేంద్రమైన మక్తల్ పట్టణ శివారు గొల్లపల్లి సమీపంలో దాదాపు రూ. 200కోట్లతో 25 ఎకరాల్లో భారీ ఎత్తున ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి భూమి పూజ చేసి పనులు ప్రారంభించగా నియోజకవర్గంలోని అన్ని గురుకులాలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరితో పాటు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి క్షీరాభిషేకం చేయడం జరిగింది. మక్తల్ పట్టణంలోని స్టేడియం గ్రౌండ్ నుంచి వచ్చే పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ అంబేద్కర్ చౌరస్తా వరకు వేలాది సంఖ్యలో విద్యార్థులు పెద్ద ఎత్తున ధన్యవాదాలు తెలుపుతూ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా గతంలో కేవలం గురుకులాలు ఏర్పాటు చేసి అద్దె భవనాల్లోనే వాటిని కొనసాగించారని, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో వందలాది కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించి కార్పొరేట్ స్థాయికి ధీటుగా దాదాపు 2000 మందికి పైగా విద్యార్థులు ఒకే చోట చదువుకునే విధంగా అన్ని చర్యలు చేపట్టారని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరికి నియోజకవర్గ ప్రజల తరఫున కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఏ. రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అన్ని గురుకులాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, విద్యార్థినిలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

## ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోండి

**గద్వాల జనవరి 27, ప్రభాతవార్త:** సంక్షేమ పథకాలలో భాగంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ధార్మిక లేదా ఇతర ట్రస్టుల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు, కార్మికులకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు సహాయ కార్మిక కమిషనర్ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారములు సంబంధిత సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో పొందవచ్చుననీ, దరఖాస్తులను ఫిబ్రవరి 15వ తేదీ లోపు సంబంధిత కార్యాలయంలో సమర్పించవలసిందిగా కోరారు. అసంపూర్తిగా ఉన్నవి లేదా గడువు ముగిసిన తరువాత సమర్పించిన దరఖాస్తులు తిరస్కరించబడుననీ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలోదిగువ తెలిపిన కోర్సులలో ఉత్తీర్ణులైన వారికివారి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు చెల్లించబడుననీ, పదవ తరగతి, ఐటిఐ వారికి – రూ. 1,000/ పాలిటెక్నిక్ వారికి – రూ.1,500/ ఇంజనీరింగ్,మెడిసిన్, లా, బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ వెటర్నరీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ హార్టికల్చర్, బీసీఏ, ఎంసీఏ, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్ కోర్సుల వారికి – రూ. 2,000/ మార్కుల శాతం ఆధారంగా అభ్యర్థులు ఎంపిక చేయబడతారనీ తెలిపారు .ఎంపికైన అభ్యర్థుల ఉపకార వేతనాలు సంబంధిత సహాయ కార్మిక కమిషనర్లు మే డే నాటికి వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తారని తెలిపారు.

## సర్పంచును సన్మానించిన బాల్యమిత్రులు

**ఉప్పునుంతల, జనవరి27 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ బాల్య మిత్రులు మంగళవారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. బాల్య మిత్రుడు చింతోజు వెంకటేష్ గ్రామ సర్పంచిగా గెలుపొందడం పట్ల బాల్యమిత్రులు తనలో ఒకరు ప్రజాప్రతినిధిగా ఎంపిక కావడం పట్ల బాల్యమిత్రులు ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతూ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల్యమిత్రులు జంగయ్య, గోలి శ్రీనివాస్,ఎండి.ఎజాస్, యాట బాలరాజ్,వెంకటేష్, కల్పన,ఉమాదేవి, జ్యోతి, కళావతి, మనీషా, శ్రీలత, జంగమ్మ, సరిత, స్వాతి తదితరులు మిత్ర బృందం పాల్గొన్నారు.

## వాసవి,వనిత క్లబ్ ఆధ్వర్యంలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ



వెల్టూరు గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్‌ను సన్మానిస్తున్న బాల్య మిత్రులు

**మక్తల్ టౌన్, జనవరి 27 ప్రభాతవార్త :** మక్తల్ వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో కీ॥శే॥ అంద్యాల ప్రమోద్ కుమార్ గుప్తా జ్ఞాపకార్థం తండ్రి అంద్యాల జనార్ధన్ గుప్త సహకారంతో 9వ వార్డు బసవేశ్వర కాలనీ నందు నూతనవాటర్ ట్యాంక్ నిర్మాణం కొరకు భూమి పూజ చేయడం జరిగింది. కాలనీవాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఈ ఎండాకాలం కూడా నీటి సమస్య చాలా ఉంటుంది. కాబట్టి ప్రజల దాహార్తి తీర్చడానికి వాసవి క్లబ్ సభ్యులు ముందుకు వచ్చి దాతల సహకారంతో కాలనీలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మించడానికి ఒప్పుకున్నందున కాలనీవాసులు వాసవిక్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.వాసవిక్లబ్ సభ్యులు మాట్లాడుతూ క్లబ్ పరంగా బీద వారికి, స్కూల్స్,వాటర్ ట్యాంక్‌లు ఏసహాయం చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని,ఈ సంవత్సరం మరింతగా క్లబ్‌సేవలు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్, అంద్యాల జనార్ధన్, వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ, కోశాధికారి తాలంపల్లి పవన్,వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వల ప్రసన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పిడిఎస్‌యు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కామ్రేడ్ మధుసూదన్ ఎన్నిక

**దామరగిద్ద, జనవరి27 ప్రభాతవార్త:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలు ఖమ్మం జిల్లా కేంద్రంలో జనవరి 23 24 25 తేదీలలో జరిగాయి. ఈ మహాసభలలో పిడిఎస్‌యు దామరగిద్ద మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన కామ్రేడ్ మధుసూదన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాష్ట్ర 23వ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. విద్యారంగ సమస్యల పరిష్కారానికై విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని పేదబడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అలుపెరగని పోరాటాలు చేస్తున్న కామ్రేడ్ మధుసూదన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికవ్వడం జరిగింది. పిడిఎస్‌యు రాష్ట్ర కమిటీకి మాజీ నేతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదవాలి

## నూతన విద్యార్థులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల జనవరి 27, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలో గల నర్సింగ్ కళాశాలలో నూతనగా జాయినింగ్ అయ్యే విద్యార్థులకు ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. మంగళవారం నర్సింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వెల్కమ్ ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యతీదులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నర్సింగ్ కళాశా లకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మ శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లా డుతూ..ప్రతివిద్యార్థి ఉన్నత లక్షయంతో చదవి, భౌష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆకాక్షించారు. గద్వాల ప్రాంతం గతం విద్యా రంగంలో వెనుకబడి ఉండేదనీ, ఈ ప్రాంతాన్నీ విద్యలో ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యాంతో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలను గద్వాలకు తీసుకురావడం జరిగిందన్నారు. వైద్యరంగం కూడా అభివృద్ధి చెందుతుందని, ఇక్కడి విద్యార్థులు అన్ని రంగాలలో రాణిం చాలని,ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా విద్యాపరంగా ఇక్కడే అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. నూతన నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణం కూడా పూర్తి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

కావడం జరిగిందనీ, త్వరలోనే ప్రారంభం కానున్నట్లు తెలిపారు. నర్సింగ్ కాలేజీని విద్యార్థులు ఈ సంవత్సరం చివరి సంవత్సరంతో వాళ్లు ప్లేస్మెంట్స్ హాస్పిటల్ లకు వెళ్లడం జరుగుతుందనీ, తాత్కాలిక భవనంలో నాణ్యతమైన విద్యను ల్యాబ్ సౌకర్యం కల్పించడం జరిగిందనీ, గద్వాల నర్సింగ్ కాలేజీ రాష్ట్రంలోనే విద్య పరంగా మూడో స్థానంలో ఉన్నదన్నారు. నూతన నర్సింగ్ కాలేజీ హాస్టల్ భవనంలోకి వెళ్ళే నూతన విద్యార్థులకు అన్ని హంగులతో అన్నిరకాల సౌకర్యాలతో ప్రారంభం కావడం జరుగుతుందన్నారు. నర్సింగ్ కాలేజ్‌లో చదువుకున్న విద్యార్థులు రోగుల పట్ల సేవాభావంతో ఉండాలనీ, ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య చికిత్సను అందించాలి సూచించారు.భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగే, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ హన్మంతమ్మ, ఏవో శ్రీధర్ రెడ్డి, లెక్చరర్స్ లక్ష్మీదేవి, శిభారాణి,వరలక్ష్మీ, ప్రణతి దీపికా, పుర నాయకులు నాగశంకర్, ధర్మ నాయుడు, జావీద్, కాలేజీ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 కోట్లతో మార్కెట్ అభివృద్ధికి కృషి

## రైతులు నాణ్యమైన వేరుశనగ తీసుకొచ్చి మద్దతు ధర పొందండి : అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



మార్కెట్ యార్డులో వేరుశనగను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, జనవరి 27 ప్రభాతవార్త:** రైతులు పండించిన పంటను శుద్ధి చేసుకొని నాణ్యమైన వేరుశనగ పంటను మార్కెట్‌కి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తమిళనాడు ఎఐసిసి పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మార్కెట్ యార్డులో వేరుశనగ ధాన్యాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10 కోట్ల వ్యయంతో మార్కెట్ అభివృద్ధికి చేస్తానని,అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ తో పాటు ఆమ్రాబాద్, లింగాల, బల్మూరు మార్కెట్ అభివృద్ధికి కోటి రూపాయలతో అభివృద్ధి, మార్కెట్ యార్డులో నూతనంగా గోదాం షెడ్డు, ఐమాక్స్ లెట్లు అతి త్వరగా నిర్మిస్తామని ఎమ్మెల్యే అన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వేరుశనగ మార్కెట్‌కు వస్తున్న తరుణంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు, వర్తక సంఘాలు, ట్రేడ్ యూనియన్ వారు సహకరించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా రైతులు ముందుగా వేరుశనగ ను తీసుకొచ్చే ముందు ఎలాంటి చెత్తాచెదారం లేకుండా చూసుకొని నాణ్యమైన ధాన్యాన్ని మార్కెట్‌కి తీసుకొచ్చి మద్దతు పొందాలని ఎమ్మెల్యే సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వరి ధాన్యానికి బోనస్, రైతులకు పండించిన పంటకు మద్దతు ధర కల్పించిన ఘనత రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. మార్కెట్ వ్యాపారులు రైతులకు అన్యాయం చేయకుండా చూడాలని కోరారు. మార్కెట్ యార్డ్ ను సందర్శించిన వారిలో ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణతోపాటు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మార్కెట్ కార్యదర్శి నరసింహులు, వ్యాపారులు కొరివి చంద్రశేఖర్, గోవింద్ సుధాకర్, కందూరు సుధాకర్, జగ్జీవన్ రావు, మార్కెట్ డైరెక్టర్లు రత్లావత్ కృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి,రైతులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తా



సర్పంచ్ బోనాసి రామకృష్ణను సన్మానిస్తున్న పాలెం గ్రామస్తులు

**బిజినేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలతో కలిసికట్టుగా కృషి చేస్తానని నాగర్ కర్నూల్ జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పాలెం సర్పంచ్ బోనాసి రామకృష్ణ అన్నారు. పాలెంలో నూతనంగా సర్పంచుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సర్పంచ్ బోనాసి రామకృష్ణను మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామాభివృద్ధి తో పాటు జిల్లాలోని ప్రతి గ్రామాభివృద్ధిలో పాలుపంచుకొని ప్రభుత్వం నుంచి నిధులుతీసుకొచ్చి మౌలిక వసతుల కల్పన,సంక్షేమ పథకాల ఫలాలు లబ్ధిదారులకు అందజేయడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారమిచ్చి అర్హులకు లబ్ధి చేకూరేందుకు కృషి చేయాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులనుఅధిరోహించి గ్రామానికి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సర్పంచ్ బోనాసి రామకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా సర్పంచులు అప్పగించిన బాధ్యతనుచిత్తశుద్ధితో గ్రామాల అభివృద్ధికి, సర్పంచుల సమస్యల పరిష్కారానికి అండదండగా ఉంటానని అన్నారు. తనను సర్పంచుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక చేసిన సర్పంచ్ల సంఘం రాష్ట్ర నాయకత్వానికి జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవిందు, శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ సుమలత, సొప్పరి బాలస్వామి గోవిందు జగదీష్ , పెద్ద కుర్మయ్య, వర్కాల రాజు, చంద్రారెడ్డి, గోవిందు సత్తన్న,గోవిందు శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, దశరథం గౌడ్, శివ, శ్రీకాంత్, మల్లికార్జున్, రాము తదితరులు ఉన్నారు.

# పాలమూరు విద్యాశాఖలో అవినీతి..?

- సర్టిఫికెట్లకు రేట్లు.. అనుమతులకే లక్షలు, ప్రైవేట్ పాఠశాలల అనుమతుల అవినీతి
- విద్యార్థి సంఘాల ఆరోపణ



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

**మహబూబ్‌నగర్, జనవరి27 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖలో అవినీతి, నిర్వాహక,నిరక్ష్యంతారాస్థాయికి చేరిందని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ,ఐఎఫ్ఐ, గ్రాడ్యుయేషన్,అసోసియేషన్, పిడిఎస్యు గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, అలాగే ఎంఈఓ లక్ష్మణ్ సింగ్ వ్యవహారం పూర్తిగా అనుమానాస్పదంగా ఉందని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఖమ్మం జిల్లాకు అడిషనల్ డైరెక్టర్‌గా బదిలీ అయినప్పటికీ అక్కడ జాయిన్ కాకుండా, మహబూబ్‌నగర్‌లో తాత్కాలిక అధికారిగా కొనసాగుతున్నారని తెలిపారు. దాదాపు10నెలలుగా జీతం లేకుండా ఎలా కొనసాగుతున్నారన్నదే పెద్ద ప్రశ్న అని, ఇది అవినీతికి నిదర్శనమని ఆరోపించారు.పని సమయాల్లో విద్యాశాఖ కార్యాలయంలో ఉండాల్సిన డీఈవో వివిధఫంక్షన్లు,రిటైర్మెంట్ కార్యక్రమాలు, గృహప్రారంభోత్సవాల్లో సమయం గడుపుతూ విద్యా వ్యవస్థను పూర్తిగా నిరక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు అనధికారికంగా,అనుమతులు, పునరుద్ధరణలు ఇచ్చి భారీగా నగదు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను నిరక్ష్యం చేస్తూ, ప్రైవేట్ స్కూళ్లకు కొమ్ముకాస్తున్నారని తెలిపారు.బదిలీలు రద్దు చేశామంటూ పత్రికా ప్రకటనలు ఇచ్చి, వెనుకబడిగా,మళ్లీడిప్యూటేషన్లు అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఎంఈఓలు, హెచ్ఎంలకు తెలియ కుండాఅనధికారిక నియామకాలు,బదిలీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు..ప్రైవేట్ స్కూళ్ల అనుమతులు, పునర్నవీకరణ ఫైళ్లపై సమగ్రఆడిట్అక్రమంగా వసూలు చేసిన నగదును గుర్తించి చట్ట పరమైన చర్యలుడీఈఓ, ఎంఈఓ లను ఉద్యోగం నుంచి తొలగిం చాలి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు,జిల్లాఇంచార్జ్ రాము,ఎస్ఎఫ్ఐ రాష్ట్రఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్,కార్యదర్శి భరత్, వైస్ ప్రెసిడెంట్‌నందు,బాలకృష్ణ,గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ కార్యదర్శి భరత్, పిడిఎస్‌యు జిల్లాఅధ్యక్షుడు మారుతి, సహాయ కార్యదర్శి సంజీవ, జిల్లా నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# బూనీడులో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న దృశ్యం

**మద్దూరు, జనవరి 27 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూరు–కొత్తపల్లి మండల పరిధిలోని బూనీడు గ్రామంలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించి అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. కొడంగల్ కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఎనుముల తిరుపతిరెడ్డిల కృషితో సబ్‌స్టేషన్ మంజూరు కానుందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తూ వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన ఒక ఎకరం భూమిని కొత్తపల్లి తహసిల్దార్ జయరాములు పరిశీలించారు.ఈ సందర్భంగా స్థలఅనుకూలత, రవాణా సదుపాయాలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుష్పమ్మ శ్రీనివాస్, కోట్ల మహేందర్‌రెడ్డి, లైన్మెన్ రాములుతో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సబ్‌స్టేషన్ మంజూరు అయితే భూనీడు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగవుతుందని ప్రజలు ఆనంద వ్యక్తం చేశారు.

# జోగులాంబ గద్వాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సన్నాహాలు

## వార్డులు, పోలింగ్ స్టేషన్ల వివరాలు విడుదల

**అలంపూర్ జనవరి27,ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డులు, పోలింగ్ స్టేషన్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ జిల్లాలోని 4 మున్సిపాలిటీల్లో మొత్తం 77 వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం, మొత్తం జనాభా 1,13,709 కాగా, అందులో ఎస్టీలు 730,ఎస్సీలు 18,238 మంది ఉన్నారు. జనవరి 17,2026 నాటికి మొత్తం ఓటర్ల సంఖ్య 1,08,524గా నమోదైంది,అందులో పురుషులు 52,851, మహిళలు 55,661, ఇతరులు 12 మంది.ఈ ఎన్నికల్లో 111 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.మున్సిపాలిటీల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:
ఆలంపూర్ మున్సిపాలిటీ: 10 వార్డులు, 2011 జనాభా 13,232 (ఎస్టీలు81,ఎస్సీలు2,875). అసెంబ్లీ నియోజకవర్గం: 80 (ఎస్సీ) ఆలంపూర్.పోలింగ్ స్టేషన్లు: 10. ఓటర్లు: పురుషులు 4,681, మహిళలు 4,940, ఇతరులు 1, మొత్తం 9,622.
ఐజా మున్సిపాలిటీ: 20 వార్డులు, 2011 జనాభా 27,921 (ఎస్టీలు 132, ఎస్సీలు 6,408). అసెంబ్లీ నియోజకవర్గం: 80 (ఎస్సీ)ఆలంపూర్.పోలింగ్ స్టేషన్లు: 26.ఓటర్లు: పురుషులు 11,230, మహిళలు 11,786, ఇతరులు 0, మొత్తం 23,016.
వడ్డేపల్లి మున్సిపాలిటీ: 10 వార్డులు, 2011 జనాభా 13,267 (ఎస్టీలు 127, ఎస్సీలు 2,762). అసెంబ్లీ నియోజకవర్గం: 80 (ఎస్సీ)ఆలంపూర్. పోలింగ్ స్టేషన్లు: 9.ఓటర్లు: పురుషులు 5,256, మహిళలు 5,347, ఇతరులు 1, మొత్తం 10,604. అధికారులు వేలదించారు.

## మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, జనవరి 27 ప్రభాతవార్త:** మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలిపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి ముందుండాలన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వంవచ్చాక అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, మంజూరు చేయడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. దేవరకద్ర మున్సిపాలిటీలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సూచించారు.

## నామినేషన్‌కు ముందు పన్నుల చెల్లింపు తప్పనిసరి

### మద్దూరు మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్

**మద్దూరు, జనవరి 27 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోఎన్నికల్లో నామినేషన్ దాఖలుచేయాలనుకునే ప్రతి అభ్యర్థి తమకు సంబంధించిన ఇంటి పన్ను (హౌస్ ట్యాక్స్),వాటర్ ట్యాక్స్‌ను తప్పనిసరిగా చెల్లించి ఉండాలని మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పన్నులు ఉన్న అభ్యర్థుల నామినేషన్లు నియమావళి ప్రకారం తిరస్కరించబడే అవకాశంఉందని ఆయన హెచ్చరించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం బాకీలు ఉన్నవారు ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కాదని తెలిపారు.ఇప్పటికే పన్నులు చెల్లించని వారు వెంటనే మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి తమ బాకీలను చెల్లించి రశీదులు పొందాలని సూచించారు. నామినేషన్ సమయంలో పన్నుల చెల్లింపు ఆధారాలను పరిశీలించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.ఈ అవకాశాన్ని వినియోగించుకొని అభ్యర్థులు తమ పన్నుల వ్యవహారాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## ఆర్మీకి ఎంపికైన నల్లమల శ్రీరంగపూర్ వాసి

**లింగాల, జనవరి27 ప్రభాతవార్త:** లింగాల మండలంలోని నల్లమల ప్రాంతమైన ఎర్రపెంట గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీరంగపూర్ గ్రామానికి చెందిన శివశంకర్ రావు ఆర్మీ సిఆర్పీఫ్‌గా ఎంపికై విధుల్లో చేరాడు. తల్లిదండ్రులు మల్లేష్ రావు, శైలజ ప్రోత్సాహం, పట్టుదలతో శ్రమించి ఎంపికైనట్లు శివశంకర్ రావు తెలిపారు. మాజీ సర్పంచ్ అక్కమ్మ, సన్నయ్య ఆధ్వర్యంలో సంతోష,సందీప్ శివ,సరోజ, గణేష్,సైదమ్మ,రత్నయ్య, నర్సయ్య, జగదయ్య,కృష్ణయ్య,జంగస్వామి,మల్లయ్య,వంశీ,కురుమయ్య,శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించారు.

## రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు

**లింగాల, జనవరి27 ప్రభాతవార్త:** వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి అనిల్ అన్నారు. మంగళవారం సబ్సిడీతో కూడిన పరికరాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన పరికరాలు 50 శాతం సబ్సిడీపై రోటవేటర్, పెట్రోల్ పంపులు రకరకాల వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో జీకే ఆగ్రో ఇంప్లిమెంట్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గాలేటి కార్తీక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాల పూర్ణాహుతి

**బిజినేపల్లి, జనవరి27 ప్రభాతవార్త:** పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాల పూర్ణాహుతి కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులచే శాస్త్రోక్తంగా పూర్ణాహుతిలో భాగంగా హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పురవీధుల గుండా స్వామి అమ్మవార్లను ఊరేగించి వైభవంగా చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆలయ మాజీ చైర్మన్ జున్నా శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి, కార్యనిర్వహణ అధికారి సిహెచ్ రంగారావు, గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ, మాజీ మండలాధ్యక్షులు పి.శ్రీనివాస్ గౌడ్, పాలెం ఉప సర్పంచ్ కండక్టర్ శ్రీను,డా.గోపాల్,గాడి సురేందర్,మాజీ సర్పంచ్ గోవింద్, నాగరాజు, మధు, రాజేశ్వరి టీచర్,ఆలయ సిబ్బంది, శివ , బాబయ్య, అర్చకులు, భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత : కేసు నమోదు

**చిన్న చింతకుంట, జనవరి 27 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం దాసర్ పల్లి గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం లక్ష్మారెడ్డి పొలం దగ్గర ఇసుకను తరలిస్తున్న ఏపీ 28 డిహెచ్ 1718 నంబర్ గల ట్రాక్టర్ ఆపి అనుమతులను తనిఖీ చేయగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి, ట్రాక్టరు తోపాటు ట్రాక్టర్ డ్రైవర్ అంజన్న పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఓబుల్ రెడ్డి తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, పాల్గొన్న జిల్లా కలెక్టర్లు ఎస్పీలు, అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌రాణి కుముదిని జిల్లా కలెక్టర్లు, అధికారులు పాల్గొని మున్సిపాలిటీలు మరియు మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి రెండో సాధారణ మునిసిపల్ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌బాదావత్ సంతోష్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి అదనపు కలెక్టర్ దేవ సహాయం, మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులు, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుమిదిని మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఓటర్లకు ఎన్నికలపై అవగాహన ఎక్కువగా ఉండేందున ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, తప్పిదాలు లేకుండా నిర్వహించేలా జిల్లా ఎన్నికల యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలుచేస్తూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని, జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటీల్లో 65వార్డులు,131 పోలింగ్ కేంద్రాలు, ఎన్నికలను చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. బుధవారం ఈనెల 28వ తేదీ నుండి నామినేషన్ల ప్రక్రియను అత్యంత పకడ్బందీగా సజావుగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఏవైనా సమస్యలుతలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణపై మున్సిపాలిటీ అధికారులతో తరచూ టెలీ కాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు ఆయా పార్టీల గుర్తులు కేటాయించబడతాయని, మిగతా ఎన్నికల ప్రక్రియ అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి మాస్టర్ శిక్షకుల ద్వారా అవసరమైన శిక్షణతో పాటు పూర్తి సహాయ సహకారాలు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

**మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేయాలి : కలెక్టర్ బి యం సంతోష్**

**గద్వాల జనవరి27,ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించినట్లే మున్సిపల్ ఎన్నికలను కూడా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలతో పోలిస్తే మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య కొంచెం తక్కువగా ఉన్నప్పటికీ ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటర్లకు ఎన్నికలపై అవగాహన ఎక్కువగా ఉంటుంది కాబట్టి తప్పిదాలు చోటు చేసుకోకుండా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా ఆయా జిల్లాల ఎన్నికల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. ఎం.సంతోష్ వీసీ అనంతరం జిల్లా ఎన్నికల అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని నాలుగు పురపాలికల్లో నామినేషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై అన్ని మున్సిపాలిటీల అధికారులతో తరచూటెలీ, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల పరంగా పోటీ చేసే అభ్యర్థులకు ఆయా పార్టీల గుర్తులు కేటాయించడం జరుగుతుందని, మిగతా ప్రక్రియ మొత్తం గ్రామ పంచాయతీ ఎన్నికల మాదిరే ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికీ మాస్టర్ శిక్షకులు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేసేందుకు అవసరమైన పోలీస్ బందోబస్తు నియమించనున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర మున్సిపాలిటీ



## మున్సిపాలిటీకి మహార్దశ

- దేవరకద్ర మున్సిపాలిటీకి రూ.33 కోట్లు నిధులు మంజూరు
- రాష్ట్ర ముఖ్యమంత్రికి దేవరకద్ర ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు

**దేవరకద్ర, జనవరి 27 ప్రభాతవార్త:** సేవ దృక్పథం కలిగిన మంచి నేత దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అని దేవరకద్ర మున్సిపాలిటీ కాంగ్రెస్‌నాయకులు కొనియాడారు. ఒకవైపు ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి మరోవైపు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని అన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో మచ్చలేని నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారని దేవరకద్ర మున్సిపాలిటీ నాయకులు కొనియాడారు. ఈ మేరకు దేవరకద్ర మున్సిపాలిటీకి ఇప్పటికి రూ. 33 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా దేవరకద్ర మున్సిపాలిటీకి కంకణం కట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పించి నిధులు తెచ్చిన సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి దేవరకద్ర నియోజకవర్గ నాయకులు,దేవరకద్ర మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలా దేవరకద్ర మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి,ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దిన ఘనత దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికే దక్కుతుందని దేవరకద్ర మున్సిపాలిటీ నాయకులు కార్యకర్తలు అన్నారు.

## రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూసామం 2025,26 పథకం కింద మంజూరైనయాంత్రికరణ పరికరాల పంపిణీ కార్యక్రమం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట నియోజక వర్గంలోని అన్ని మండలాల పదర, అమ్రాబాద్, బల్మూరు, లింగాల, అచ్చంపేట, ఉప్పు నుంతల, వంగూర్,చారకొండ మండలాల రైతులకు వ్యవసాయ పరికరాలు, రూట్ వేటర్, పెట్రోల్ పంపులు, ఇతర వ్యవసాయ పరికరాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ యాంత్రికరణ 50 శాతం సబ్సిడీపైవ్యవసాయ పరికరాలు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో వ్యవసాయ యాంత్రికరణ పరికరాలు రోటవేటర్లు 19, పవర్ స్ప్రేయర్లు 55, బ్యాటరీ స్ప్రేయర్లు 02, బ్రష్ కట్టర్లు 04, కేజ్ వీల్స్ 01, పవర్ వీడర్లు 02, స్ట్రా బేలర్లు 03, కల్తీ వేటర్లు03 పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు, అచ్చంపేట వ్యవసాయ సంచాలకులు చంద్రశేఖర్, రమేష్, కృష్ణయ్య, నరేష్, మహేష్, అనిల్, ప్రియదర్శిని పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడల్లో విద్యార్థులు రాణించాలి

### ఎంపీడీవో విజయలక్ష్మి

**రాజాపూర్, జనవరి 27 ప్రభాతవార్త:** సీఎం కప్ క్రీడల్లో విద్యార్థులు రాణించి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక కావాలని రాజాపూర్ మండల ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం రాజాపూర్ గ్రామ సచివాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాటాడారు. ఈ సన్నాహక సమావేశంలో తహసిల్దారు రాధాకృష్ణ, ఎంఈఓ సుధాకర్, ఎస్ఐ శివానందగౌడ్,ఎంపిఈఓ వెంకట్ రాములు, జిహెచ్ఎం ఎస్‌డి.ఇబ్రహీం, రాజపూర్ గ్రామ సర్పంచ్ కావలి రామకృష్ణ, పిడి రాములు, వెంకటమ్మ, పిఈటి రాధిక, మండలంలోని అన్ని గ్రామాల సెక్రటరీలు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**చిన్నంబావి, జనవరి27 ప్రభాతవార్త:** మండల తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల కళ్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ లబ్ధిదారులకు తహ సిల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుపాల్గొన్నారు. మండల పరిధిలో 12 మంది లబ్ధిదారులకు రూ.12 లక్షల 1392ల చెక్కులను స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో అందజేయడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం కాకుండా, ప్రభుత్వం అందజేస్తున్న రూ.1,00,116ఆర్థిక సహాయాన్ని పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావుకి, గ్రామ సర్పంచులకు కళ్యాణలక్ష్మి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు రామ చంద్రారెడ్డి, బీమపల్లి యాదవ్, సింగల్ విండో మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు బిచ్చన్న, జయమ్మ, శరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హుస్సేనయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాపన్‌పల్లి యువకుడికి రాష్ట్ర స్థాయి సంకల్ప యువ పురస్కారం

**దామరగిద్ద, జనవరి 27 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని బాపన్‌పల్లి గ్రామానికి చెందిన రంగయ్య గౌడ్‌కి రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మక సంకల్ప యువ పురస్కారం లభించడం పట్ల గ్రామస్తులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి (పరాక్రమ దివస్) సందర్భంగా యువతలో సామాజిక స్పృహ పెంపొందించేందుకు ఆయన చేస్తున్న విశేష సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. చిన్న వయస్సులోనే సామాజిక బాధ్యతను గుర్తించి యువతను చైతన్యపరిచేకార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సమాజాభివృద్ధి, యువత సంక్షేమం పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. రంగయ్యగౌడ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, సామాజిక సేవలో మరింత ముందుకు సాగాలని గ్రామ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాల జాతర

**దామరగిద్ద, జనవరి 27 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలో మంగళవారం శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మదేవి బోనాల జాతర కనుల పండువగా జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా రెట్టపట్ల కార్యక్రమం నిర్వహించగా అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనికి రెడ్డి, ఉపసర్పంచ్ సత్తి సత్యనారాయణ,వార్డు సభ్యులుగ్యాంగ్ హను మంతు, తులసి, బోరయాంకప్ప, ఆలయ పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పీజీ కళాశాల సమస్యలను పరిష్కరించాలి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆది

**కొల్లాపూర్, జనవరి27 ప్రభాతవార్త:** కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో ఉన్న పీజీ కళాశాలలో అకాడమిక్ ఇయర్ పూర్తి కావస్తున్న, పలు సమస్యలు నెలకొన్న, నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదనీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆది అన్నారు. మంగళవారం పిజి కళాశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఐడి కార్డ్స్,హాస్టల్ మెనూ అమలు,లైబ్రరీ,క్రీడా సామాగ్రి,ఆట స్థలం వంటి 8 డిమాండ్లతో పీజీ కళాశాల ప్రిన్సిపల్ మార్క్స్ పోలోనియస్‌తో డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి,పరిశీలన చేసి,పరిష్కరించేందుకు" చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ హామీ ఇచ్చారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆది, ఎస్ఎఫ్ఐ పీజీ కళాశాల కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు విలాస్ నాయక్, శివ,సహాయ కార్యదర్శులు లక్ష్మి, సంగీత,మమత, కళాశాల కమిటీ సభ్యులు ప్రవీణ్, రవి, అనిల్,ఆంజనేయులు, కపిల్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మాజీ కౌన్సిలర్ గీతమ్మ మృతి

### అంతిమ యాత్రకు హాజరైన ఎమ్మెల్యే



**గద్వాల జనవరి 27, ప్రభాతవార్త:** పట్టణంలోని 3వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ గీతానాగులు యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని గీతమ్మ పార్థివదేహానికి పూల మాల వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం భర్త నాగులు యాదవ్‌ను, పిల్లలను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. గీతమ్మ అంతిమయాత్రలో పాల్గొని శవ పల్లకిని మోశారు. ఎమ్మెల్యే వెంట జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, నాయకులు నరసింహ రెడ్డి, ఆనంద్‌గౌడు, సాయిశ్యామ్‌రెడ్డి,తుమ్మల నర్సింహులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శక్తిపీఠం తెలుగు డైరీ ఆవిష్కరణ

**నారాయణపేట, జనవరి27 ప్రభాతవార్త:** నారాయణ పేట పట్టణ కేంద్రంలోని స్థానిక శక్తి పీఠం ప్రాంగణంలోని స్వామి శాంతానంద సభా మండపంలో మంగళవారం శక్తి పీఠం తెలుగు డైరీలను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని శక్తి పీఠం మార్గదర్శకులు బ్రహ్మశ్రీ ఉట్కూర్ యజ్ఞనారాయణ పురోహిత్, శక్తి పీఠం ట్రస్ట్ సభ్యులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ ఉట్కూర్ యజ్ఞనారాయణ పురోహిత్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంపూర్ణ పంచాంగం, హిందూ పండుగల వివరాలతో కూడిన ఏకైక తెలుగు డైరీ శక్తి పీఠం నుంచి వెలువడడం ఈ ప్రాంత ప్రజలందరికీ గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠం ట్రస్ట్ సభ్యులు దోమ సుధాకర్, నంది రాజశేఖర్, కర్నె గంగాధర్ రెడ్డి, ఉట్కూర్ విభావసు పురోహిత్ అగ్నిహోత్రి, నారాయణపేట జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకులబాలప్ప,శక్తి పీఠంఉద్యోగబృందం, భక్తులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

**చిన్నంబావి, జనవరి27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని దగడపల్లి గ్రామానికి చెందిన గునమోనీ గోపాల్ కు చెందిన సుమారు 100కు పైగా గొర్రెలు అనుమానాస్పదంగా మృతి చెందాయి. గత కొన్ని రోజులుగా గొర్రెలు మృతి చెందడంతో వెటర్నరీ డా.స్వాతికి సమాచారం అందించి కొన్ని గొర్రెల మృతికి గల కారణాలను తెలుసుకోవడానికి పోస్టుమార్టం నిమిత్తం మహ బూబ్‌నగర్ తీసుకెళ్లారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా బాధిత రైతుకు న్యాయం చేయాలని పలువురు గ్రామస్తులు అన్నారు. ఈ విషయంపై బాధిత రైతు మాట్లాడుతూ గొర్లనుపెంచడమే జీవనాధారంగా జీవిస్తున్న తనకు ప్రభుత్వం ఆదుకోవాలని వాపోయాడు.

## నిరుద్యోగ యువతకు డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ డిజిటల్ యాప్

### మైనారిటీ సంక్షేమ అధికారి ఎంఏ రషీద్

**నారాయణపేట, జనవరి 27 ప్రభాతవార్త :** ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ ఒక ఉపయోగకరమైన డిజిటల్ వేదిక అని మైనారిటీ సంక్షేమ అధికారి ఎంఏ. రషీద్ తెలిపారు. ఈ వేదికలో నమోదు చేసుకోవడానికి విద్యార్హతపై ఎటువంటి పరిమితి లేదని ఆయన స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతను ఉపాధి అవకాశాలతో అనుసంధానించడానికి,వివిధ సంస్థలు, ఆన్‌లైన్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృత్రిమ మేధస్సు సాంకేతికత ఆధారంగా మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించిందని తెలిపారు. ఈ డిజిటల్ వేదిక ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ సౌకర్యాన్ని నిరుద్యోగ యువత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, ముఖ్యంగా మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యాప్‌లో నమోదు చేసుకోవడానికి ఎటువంటి విద్యా అర్హత పరిమితి లేదని, వివిధ విద్యా, సాంకేతిక నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా తాము కోరుకున్న రంగాలకు సంబంధించిన ఉపాధి అవకాశాలను తెలుసుకోవచ్చని తెలిపారు. నమోదు విధానం గురించి వివరిస్తూ ఆసక్తి గల అభ్యర్థులు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు), ఏజెన్సీలు తమ మొబైల్ ఫోన్లలో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఉద్యోగార్థులుగా నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

# హైదరాబాదుకు బస్సు సౌకర్యం కల్పించాలి



ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసిన రాజేంద్రప్రసాద్ యాదవ్

**శ్రీరంగాపూర్, జనవరి 27 ప్రభాతవార్త:** మాజీ జడ్పిటిసి రాజేందర్ ప్రసాద్ యాదవ్ తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.నాగిరెడ్డిని హైదరాబాద్ బస్‌భవన్‌లో కలిసి శ్రీరంగాపూర్ మండలంలో దీర్ఘకాలంగా నెలకొన్న రవాణా సమస్యలను వారితో చర్చించారు. రాష్ట్రస్థాయి ఆర్టీసీ అధికారులు రీజనల్ మేనేజర్లు డిపో మేనేజర్లకు అనేక విన్నపాలు చేసినప్పటికిని ఎటువంటి క్షేత్రస్థాయి పరిశీలన గాని చర్యలు గాని చేపట్టలేదు అని వివరించారు. 500 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ రంగనాయక స్వామి దేవాలయం రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మధ్యలో కొలువై ఉన్న ఈ ఆలయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ క్షేత్రానికి వివిధ రాష్ట్రాల నుంచి ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పర్యటకులు వస్తుంటారని తెలియజేశారు. శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో బస్ స్టేషన్‌కు నిధులు మంజూరు చేయాలని కొల్లాపూర్‌నుండి శ్రీరంగాపురం మండలం మీదుగా హైదరాబాదుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. శ్రీరంగాపూర్ నుంచి పెబ్బేరుకు సెటిల్ సర్వీసులను ఏర్పాటు చేయాలని శ్రీరంగాపురం మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరడం జరిగిందని ఈ అంశాలను సానుకూలంగా పరిశీలించి ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై ఉన్న పెబ్బేరు నుండి శ్రీరంగాపూర్ మండల కేంద్రం కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంది మీరు వ్యక్తిగతంగా ఈ ప్రాంతాన్ని సందర్శించి స్థానిక ప్రజలకు భక్తులకు న్యాయం చేసేలా చూడాలని తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి. నాగిరెడ్డిని కోరడం జరిగిందని తెలియజేయడం జరిగింది.

# ఐదు రోజుల బ్యాంకింగ్ అమలు చేయాలి



సమ్మెలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

**మహబూబ్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో జరిగిన సమ్మె ఘనవిజయం సాధించింది. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన న్యాయమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వ నిరక్ష్య వైఖరికి నిరసనగా, యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ల పిలుపునిచ్చిన ఈ సమ్మెలో లక్షలాది బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సమ్మెకు భాగంగా మహబూబ్‌నగర్ నగరంలో కూడా బ్యాంక్ ఉద్యోగులు భారీగా పాల్గొని తమ నిరసనను స్పష్టంగా వ్యక్తం చేశారు. ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణను ఆపాలి, ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలి, బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయాలి అనే ప్రధాన డిమాండ్లతో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుఎఫ్‌బియు నాయ కులు పాల్గొనిమాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ కొన్ని డిమాండ్లను అంగీకరించినప్పటికీ,బ్యాంక్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అయిన ఐదురోజుల బ్యాంకింగ్ విధానం ఇప్పటివరకు అమలు చేయలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంబంధిత అధికారులు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నిరక్ష ్యం చేస్తే,భవిష్యత్తులో కూడాఇలాంటి భారీస్థాయి సమ్మెలు మరింత తీవ్రంగా నిర్వహించాల్సి వస్తుందని యుఎఫ్‌బియు నాయ కులు స్పష్టమైన హెచ్చరిక చేశారు. బ్యాంకులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలని,బ్యాంక్ ఉద్యోగులపై భారం పెంచుతూ ప్రజారంగ బ్యాంకులను బలహీనపరిచే విధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని వారు స్పష్టం చేశారు. ఈ సమ్మె పూర్తిగా శాంతియుతంగా కొనసాగిందని, బ్యాంక్ ఉద్యోగులఐక్యత, సోదరబలాన్ని దేశానికి చాటి చెప్పిందని నాయకులు తెలిపారు. కెనరా బ్యాంకు అసోసియేషన్ నాయకులు పి.తిరుమలరెడ్డి, ఎంఆర్ జైకర్, బి.నరేష్ కుమార్ పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ కాంపౌండ్ కూల్చివేతపై ఆగ్రహం

**గద్వాల జనవరి 27, ప్రభాతవార్త:** గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ కాంపౌండ్ గోడ కూల్చి వేతపై జెడ్పీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజక వర్గఇంచార్జ్ సరిత తిరుపతయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మార్కెట్ యార్డ్ ప్రాంతాన్ని సందర్శించి కాంపౌండ్ గోడ కూల్చివేత ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. మార్కెట్ సెక్రటరీ తో మాట్లాడి వివరాలు తెలుసున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. అక్రమ నిర్మాణాలకు పాల్పడే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, సొంత లాభం కోసం అక్రమ నిర్మాణాలకు తెరలేపడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్ కాంపౌండ్ గోడను కూల్చివేసి, అక్కడ కొత్తగా షాపుల నిర్మాణానికి ప్రయత్నిస్తున్న వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా గోడ కూల్చివేస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగాఉన్నారని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఇప్పటికైనా స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమలేశ్, పులిపాటి వెంకటేష్, పెద్దపల్లి రాజశేఖర్, రెడ్డి, భాస్కర్ యాదవ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ ద్వారానే విక్రయాలు జరపాలి

### జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్

**మద్దూరు, జనవరి27 ప్రభాతవార్త:** మద్దూరు మండలంలోని వివిధ ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియాయాప్ ద్వారానే నేటి నుంచి యూరియా విక్రయాలు తప్పనిసరిగా జరపాలని దుకాణ యజమానులకు సూచించారు. యూరియా కొనుగోలు కోసం వచ్చే రైతులకు యూరియా యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత డీలర్లదేనని ఆయన స్పష్టం చేశారు. యాప్ ద్వారా మాత్రమే విక్రయాలు జరగడం వల్ల అక్రమాల నివారణతోపాటు రైతులకు సరైనవిధంగా ఎరువుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కోస్గి ఏడీఏ రామకృష్ణ, మద్దూరు మండల వ్యవసాయ అధికారి ఎ. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

(మొదటి పేజీ తరువాయి)

చేసి 10.30 నుండి నామినేష్ల స్వీకరణ ప్రారంభించాలని ఆదేశించారు. నామినేషన్ సెంటర్లలో నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఏ ఒక్క కొత్త అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి వీలు లేదని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, వనపర్తి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిపిఓ రఘునాథ్ రెడ్డి, మిగతా మున్సిపాలిటీల కమిషనర్లు , సిపిఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవంలో కుంభం శివకుమార్ రెడ్డి

**నారాయణపేట, జనవరి27 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం లింగంపల్లి గ్రామంలో నిర్వహించిన ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జి కుంభం శివ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లికి తొలి పూజ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు,యువత,రైతులు సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎల్లమ్మ తల్లిని ప్రార్థించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మాజీ చైర్మన్‌బండి వేణుగోపాల్ భక్తులు, గ్రామస్తులు, మండల ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్దూరు మున్సిపాలిటీలో సాధారణ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

**మద్దూరు, జనవరి 27 ప్రభాతవార్త:** మద్దూరు పురపాలక సంఘంలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను చేపట్టనున్నట్లు మద్దూరు మున్సిపాలిటీ కమిషనర్ సి.శ్రీకాంత్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 16 వార్డులకు పోటీ చేయనున్న అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన తేదీలు జనవరి28 (బుధవారం)నుండి జనవరి 30 (శుక్రవారం) వరకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మూడు రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని కమిషనర్ వివరించారు. ఆయా వార్డుల్లో పోటీ చేయనున్నఅభ్యర్థులు సంబంధిత నామినేషన్ కేంద్రాల్లో తమ పత్రాలను సమర్పించవచ్చని సూచించారు. అదే విధంగా నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు ధారావత్తు సొమ్మునుతప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థులు: రూ. 1,250ఇతర వర్గాల అభ్యర్థులు: రూ. 2,500నిర్దేశిత సమయపాలనను కచ్చితంగా పాటిస్తూ, పూర్తి వివరాలతో నామినేషన్లు దాఖలు చేయాలని, ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మద్దూరు మున్సిపాలిటీ కమిషనర్ సి.శ్రీకాంత్ అభ్యర్థులకు సూచించారు.

## గుట్టమీది తండా రోడ్డు పనులు ప్రారంభం

**ఉప్పునుంతల, జనవరి 27 ప్రభాతవార్త:** మండలంలోని దేవదారి కుంట తండా గ్రామపంచాయతీ శివారు గ్రామమైన గుట్టమీది తండా రోడ్డు పనులు ప్రారంభించారు. అచ్చంపేట ఉప్పునుంతల ప్రధాన రహదారిలోని ఆర్అండ్‌బి రోడ్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుట్టమీది తండా వరకు రోడ్డు పనులను ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు,దేవదారి కుంట తండా ఉప సర్పంచ్ మంగమ్మ చందు నాయక్ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి,తాండ వాసుల ఆధ్వర్యంలో రోడ్డు పనులను ప్రారంభించారు.